క్లుప్తంగా

రాజబాబు మరణం తీరని లోటు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీనియర్ రాజకీయ నాయకులు చెలికాని రాజబాబు ఆకస్మిక మరణం తమను కలచివేసిందని వ్యక్తిగతంగా పార్టీ పరంగా ఆయన మరణం తీరనిలోటని ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సీనియర్ రాజకీయవేత్తగా రాజబాబు గ్రామాల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో అందరి మన్ననలు పొంది మంచి రాజకీయ నాయకునిగా గుర్తింపు పొందారని అన్నారు.వైఎస్సార్ సీపీకి అంకితభావంతో సేవలందించారన్నారు. పెదవేగి పార్టీ మండల అధ్యక్షుడు జానంపేట బాబు, రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం సూర్యనారాయణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ తదితరులు రాజబాబు మృతికి సంతాపం తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏలూరు త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు

పెదపాడు: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని త్రీ టౌన్ సీఐ వి కోటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, సమాజంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ వేధింపులు అత్యవసర సమయంలో చేయవలసిన విధులను విద్యార్థులకు వివరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిశోర్ మాట్లాడిన అవగాహన వీడియోను స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 18 మందికి శుక్లాల ఆపరేషన్లు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 32 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు అందజేశారు.

రాట్నాలమ్మ తల్లి దేవస్థానంలో భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : రాట్నాలమ్మ తల్లి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.16,935, పూజా టికెట్ల ద్వారా రూ.30,500, ఫొటోల అమ్మకంపై రూ.1500, విరాళాలు రూ. 5,500 ఆదాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ చెప్పారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

దెందులూరు: సత్యనారాయణపురంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలపాల విజయ్ కుటుంబ సభ్యులు మాగం సత్యనారాయణ ఆలయంలో బాబాకు ప్రత్యేక అలంకరణ, పూజలు, ప్రదక్షిణలు, హోమాలు నిర్వహించారు.

కుంగిన అప్రోచ్ రోడ్డు.. ప్రయాణానికి ఇక్కట్లు


మార్జిన్ కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్న గణపవరం- బావాయిపాలెం అప్రోచ్ రోడ్డు



మార్జిన్‌లో గోతుల కారణంగా బావాయిపాలెం- గణపవరం రోడ్లలో నిలిచిపోయిన వాహనాలు

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- మహాలక్ష్మి సెంటర్లో ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు మార్జిన్
- కూడలిలో తరచూ ట్రాఫిక్ జామ్
- బిల్డింగ్ వేస్ట్‌తో గోతులు పూడ్చుకుంటున్న స్థానికులు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల వ్యయంతో రహదారులు నిర్మిస్తే.. వాటి నిర్వహణను నేటి చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదంటూ ప్రయాణికులు విమర్శిస్తున్నారు. గణపవరం నుంచి బావాయిపాలెం మీదుగా క్రొవ్విడి వరకూ నాలుగు కిలోమీటర్లు మేర రూ.3 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారి గతేడాది నిర్మించారు. రూ.7 కోట్ల వ్యయంతో 16 కిలోమీటర్లు మేర సరిపల్లె నుంచి బువ్వనపల్లి, నిడమర్రు మీదుగా ఉంగుటూరు మండలం చేబ్రోలు వరకూ ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మించారు. గణపవరం–క్రొవ్విడి ఆర్‌అండ్‌బీ రహదారి నిర్వహణలో పాలకులు పూర్తిగా విస్మరించారు. దీంతో రహదారి వెంబడి ఉన్న ఇరువైపులా ఉన్న మార్జిన్లు పలు చోట్ల కుంగిపోయి వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మహాలక్ష్మి సెంటర్లో సీసీ రోడ్డుకు, ఆర్‌అండ్‌బీ తారు రోడ్డుకు నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తిగా కుంగిపోయి తరచూ అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానిక వ్యాపారులు చెపుతున్నారు. ఈ గోతుల వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ప్రమాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.


కుంగిపోయిన రోడ్డు మార్జిన్‌లోని గోతులను పూడ్చుతున్న స్థానికులు

దీంతో స్థానికులే నడుం బిగించి బిల్డింగ్ వేస్ట్‌తో గోతులను పూడ్చుకుంటున్నారు.

ప్రమాదకరంగా మార్జిన్ గోతులు

బావాయిపాలెం- గణపవరం నాలుగు రోడ్ల కూడలిలో గణపవరం సీసీ రోడ్డుకు, బావాయిపాలెం తారు రోడ్డు కలిసే అప్రోచ్ రోడ్డు మార్జిన్ ఆరు నెలలుగా కుంగిపోయింది. వర్షాకాలంలో కొద్ది కొద్దిగా సీసీ రహదారి మార్జిన్ దెబ్బతింటూ, మార్జిన్ వెంబడి ప్రస్తుతం అడుగు వరకూ లోతులో అప్రోచ్ రోడ్డు దిగిపోయింది. దీంతో ఆ మార్జిన్ దిగి వెళ్లేందుకు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మార్జిన్ వెంబడి అడుగులోతులో గోతులు ఏర్పడటంతో ద్విచక్ర వాహనాదులు పడిపోతున్నారు. స్కూటీ వంటి వాహనాల చక్రాలు చిన్నగా ఉండటంతో స్కూటీ మాదిరి స్కూటర్లు నడిపే మహిళలు మార్జిన్ దిగే సమయంలో అదుపుతప్పి పడిపోయి గాయపడిన సందర్భాలు అనేకం ఉన్నట్లు స్థానిక వ్యాపారులు చెపుతున్నారు.

రాత్రి వేళల్లో అదుపుతున్న వాహనాలు

మార్జిన్ గోతులు లోతు ఎక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో ఆ మార్గంలో వెళ్లే కార్లు ఒకేసారి గోతుల్లో పడిపోవడంతో అదుపుతప్పి అటువైపు వెళ్లే వారిపై దూసుకుపోతున్నాయి. ధాన్యం లోడు లారీలు అడుగు ఎత్తు సీసీ రహదారి మార్జిన్ ఎక్కించలేక వెనక్కు వెళ్లిపోతున్నాయి. నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో ఈ గోతుల వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ చోటు చేసుకుంటోంది. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరరకూ స్కూల్ బస్సులు, చేపల లోడు లారీలు, ఆకివీడు వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆలస్యమవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు చూసి స్థానికులే స్పందిస్తున్నారు

ఇటీవల ఇదే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో బావాయిపాలెం–సిద్ధాపురం మలుపులో రోడ్డు ఇరువైపులా కుంగిపోయి పంటకాలువల తూరలు పగిలిపోయి ప్రమాదాలు జరుగుతుండటంతో అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో బావాయిపాలెంలోని యువకులు ముందుకువచ్చి ఎర్ర గ్రావెల్‌తో గోతులు పూడ్చుకున్నారు. ఆదివారం స్థానిక చిరు కూరగాయల వ్యాపారి మహాలక్ష్మి సెంటర్లోని సీసీ రోడ్డు మార్జిన్ గోతులను బిల్డింగ్ వేస్ట్‌తో పూడ్చే కార్యక్రమం ప్రారంభించారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులాఉన్న మార్జిన్లలో మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోలేదు


బావాయిపాలెం వైపు ఉన్న సీసీ రహదారి మార్జిన్ అడుగులోతులో కుంగిపోయింది. ఈ విషయంపై ఇటీవల గణపవరం సీసీ రహదారికి ఇరువైపులా తారు రోడ్డుతో అప్రోచ్ నిర్మించారు. అప్పుడు బావాయిపాలెం వైపు కూడా వెయ్యమని అధికారులను అడిగితే కాంట్రాక్టర్లు వేర్వేరంటూ సమాధానం చెప్పారు. ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బిల్డింగ్ వేస్ట్‌తో తాత్కాలికంగా గోతులు పూడ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– పాములపర్తి త్రిమూర్తులు, చిరు వ్యాపారి

స్కూటీతో వెళ్లేందుకు అవస్థలు


బాయిపాలెం జెడ్పీ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. దీంతో గణపవరం–బావాయిపాలెం రోజు స్కూటీ వాహనంలో వెళుతుంటాను. సీసీ రహదారి నుంచి బావాయిపాలెం రోడ్డు మలుపులో తిరగాలి. ఆ మలుపులో సీసీ రహదారి అప్రోచ్ రోజు రోజుకీ కుంగిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది.స్కూటీతో రోడ్డుపైకి చేరేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నాను.

– సీహెచ్‌బీల్ కుమారి, టీచర్, గణపవరం

రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


గత ప్రభుత్వం రూ.3 కోట్లతో నిర్మించిన బావాయిపాలెం ఆర్‌అండ్‌బీ రహదారి ఇటీవల మార్జిన్లు కుంగిపోయి తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. చంద్రబాబు సర్కారు వచ్చిన తర్వాత కనీసం రోడ్ల నిర్వహణను చేయకపోవడం దారుణం. అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో మా గ్రామంలోని యవకులే రోడ్లు మార్జిన్లలో ఎర్ర కంకరతో పూడ్చుకుంటున్నారు.

– గొట్టుముక్కల విశ్వనాథరాజు, బావాయిపాలెం

లారీ డ్రైవర్ మృతిపై కేసు నమోదు

పెదవేగి : లారీ డ్రైవర్ అకస్మాత్తుగా కుప్పకూలిపోయి మృతిచెందిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడలోని ఇంద్రపాలెంకు చెందిన పిల్లి నూకరాజు హైదరాబాదు నుంచి ఖాళీ మద్యం సీసాల లోడుతో తన ఏపీ31టీ డబ్ల్యూ 5319 నబర్ గల లారీతో వంగూరులోని గౌతమి ఆగ్రో ఫ్యాక్టరీ వద్దకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వచ్చాడు. లారీపైకి ఎక్కి టార్పాలిన్ కవర్‌కు కట్టిన తాళ్లను తీస్తుండగా హఠాత్తుగా వాహనంపైనే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెళ్లి చూడగా నూకరాజు స్పృహలో లేకపోవడంతో వెంటనే వారు 108 వాహనానికి సమాచారం అందించారు. వైద్య సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీనిపై పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జాతర మహోత్సవాలు


నాగదుర్గాదేవికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: కామవరం సమీపంలో ఉన్న దుర్గమ్మతల్లి, మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజుల జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గిరిజన నృత్యాలు చేసి సందడి చేశారు. ఇక్కడికి చేరుకున్న బాలరాజుకు ఆలయ కమిటీవారు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారుజామున ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో భక్తులు నడిచారు. అలాగే అమ్మవారికి పుట్టింటి చీర, సారె, కావిడ్లతో నాటు కోళ్లు, మేకపోతులతో మొక్కులు తీర్చుకుని అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు, ఆలయ కమిటీ సభ్యులు కొర్సా రాంబాబు, మడివి శ్రీను, పూనెం దుర్గమ్మ, గోగుల గంగమ్మ, తెల్లం శైలు, కేఆర్‌పురం ఎంపీటీసీ గాలి దుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంజా భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలనాటి మధుర స్మృతులతో పూర్వ విద్యార్థుల సందడి


పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన 1974-1975 బ్యాచ్ విద్యార్థులు

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ సందడి జరిగింది. 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారంతా ఆదివారం కలుసుకున్నారు. వివిధ ప్రదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి స్నేహనుభూతులను పంచుకున్నారు. 50 ఏళ్ల తరువాత పాఠశాలకు చెందిన 1974–1975 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని బాల్యంలోని మధురస్మృతులను నెమరవేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను స్నేహితులతో పంచుకున్నారు. పాఠశాల ప్రాంగణమంతా కలియ తిరుగుతూ తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన వారిని పూర్వ విద్యార్థులంతా అభినందించారు. 1974–75 బ్యాచ్ అధ్యక్షుడు కేఆర్‌కే ప్రసాద్, ఉపాధ్యక్షుడు కె శివప్రసాద్, పెదపాడు సొసైటీ రిటైర్డ్ సీఈఓ వీవీ కృష్ణయ్య, కార్యదర్శి జీ ఎల్ కామేశ్వరి, ట్రెజరర్ మోగంటి వెంకటేశ్వరరావు, అడ్వైజరీ కమిటీ మెంబర్లు దావాల వెంకటేశ్వరరావు, ఆకుల సత్యనారాయణ, లావేటి పెద్దిరాజు, కంభంపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దెందులూరు: వారంతా 25 ఏళ్ల తరువాత బాల్యంలో విద్యాభ్యాసం చేసిన పోతునూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం కలుసుకుని సందడి చేశారు. 1999–2000 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థి డీబీఆర్‌కే చౌదరి ఆధ్వర్యంలో నాయకులు సీహెచ్ ఏసుబాబు, శివకృష్ణ, బి.వీర్రాజు, ఉమ్మడి ఏసుబాబు, బొడ్డేటి నరేష్ ఆధ్వర్యంలో బాల్య స్నేహితులంతా కలిసి సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు, పిల్లల చదువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు తమ వంతు సాయం అందించాలని నిర్ణయించారు.

అమ్మవార్లకు చలిమిడి, పానకాలు సమర్పణ

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

భీమడోలు: పన్నెండేళ్లకోసారి వచ్చే భీమడోలు గ్రామ దేవతల జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుకు చలిమిడి, పానకాలు సమర్పణ వేడుక కన్నుల పండువగా జరిగింది. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలివచ్చారు. మహిళలు కుటుంబ సమేతంగా చిన్నా పెద్ద తేడా లేకుండా ఆలయానికి తరలిరావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీనితో ఆ ప్రాంతమంతా భక్తజన సంద్రంగా మారింది. విశేషంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు వెళ్లి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో చలిమిడి, పానకాలను సమర్పించారు. ఆలయ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భీమడోలు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తును నిర్వహించారు. క్యూ లైన్లలోని భక్తులకు సీఐ విల్సన్ పలు సూచనలందించారు. జాతర కమిటీ సభ్యుడు తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులను అన్ని వేళలా కాచి కాపాడుతున్న గ్రామ దేవతలైన అమ్మవార్లకు 12 ఏళ్లకోసారి జాతర ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, లోక కల్యాణార్థం అంగరంగ వైభవంగా జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయన్నారు. తొలుత అమ్మవార్లకు భక్తులు చీరలు, జాకెట్లను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవార్ల ఘటాలతో గణాచారులు పలు వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వారికి భక్తులు వస్త్రాలు పరిచి స్వాగతం పలికారు.


మద్ది రామమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


భీమడోలులో భక్తుల క్యూలైన్‌ను పరిశీలిస్తున్న సీఐ యూజే విల్సన్


భీమడోలులో గ్రామ దేవతలకు చలిమిడి, పానకాలు సమర్పిస్తున్న భక్తులు

ప్రభుత్వ తీరు... టీచర్ల బేజారు

- ఒక పూట బడి... రెండవ పూట సమావేశం
- క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ తీరుపై ఉపాధ్యాయుల అసంతృప్తి
- సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు



కొవ్వలిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దెందులూరు: ఒక పూట బడి, మరొక పూట సమావేశం, మధ్యాహ్నం ఒంటి గంటలోపు క్లస్టర్ సమావేశాలకు హాజరు కావాలని ఆదేశాలివ్వడంతో మండల కేంద్రానికి దూర ప్రాంతం నుంచి వచ్చే ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశాలపై పూర్తిస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. క్లస్టర్ పాఠశాలల్లో తొలిసారిగా ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశాలపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు సబ్జెక్టు బోధన సిలబస్ అకాడమిక్ వివరాలు లక్ష్యాలుగా క్లస్టర్ సమావేశాలకు నిర్వహించారు. ఉపాధ్యాయులను మధ్యాహ్నం 12.45 గంటలకు క్లస్టర్ సమావేశాలు నిర్వహించే పాఠశాలకు చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆఘమేఘాలపై ఉపాధ్యాయులంతా సమావేశాలకు హాజరయ్యారు. సాయంత్రం 5.30 గంటల వరకు సాంకేతిక కారణాలతో ఫేస్ రీడింగ్ హాజరు నమోదు కాలేదు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు 5 గంటల వరకే విధుల నిర్వహణ, ఇంటర్‌నెట్ పనిచేయకపోవడంతో యాప్‌లాక్ అయ్యింది. ఉన్నతాధికారులు చెప్పిన సమయానికి తాము పాఠశాలలకు చేరుకున్నప్పటికీ సాంకేతిక కారణాలతో యాప్ లాక్ కావడంతో హాజరు నయోదు పరికరాలు పనిచేయకపోతే ఉపయోగమేమిటని ఉపాధ్యాయులు అంటున్నారు. క్లస్టర్ సమావేశాల వల్ల ఉన్నత, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సబ్జెక్టు టీచర్లకు ఏ రకమైన ఉపయోగం కలుగుతుందని ఉన్నతాధికారులు పునరాలోచించాలని పలువురు కోరుతున్నారు. మధ్యాహ్న భోజనం కార్యక్రమం చాలా ముఖ్యమైందని హడావుడిగా పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించిన తరువాత క్లస్టర్ సమావేశాలకు హాజరు కావడం చాలా ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయులు సర్వత్రా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో దెందులూరు మండలంలో 4, పెదపాడు మండలంలో 3, పెదవేగి మండలంలో 4, ఏలూరు రూరల్ మండలంలో 4 క్లస్టర్లు ఉన్నాయి.

క్లస్టర్ సమావేశాల సమయం మార్పు చేయాలి


ప్రభుత్వం నూతనంగా నిర్వహిస్తున్న క్లస్టర్ సమావేశాలకు నిర్ణయించిన సమయం ఉపాధ్యాయులకు అనుకూలమైనది కాదు. దూర ప్రాంతం నుంచి వచ్చే ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో పునరాలోచించి క్లస్టర్ సమావేశాల నిర్వహణ సమయాన్ని మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలుగా నిర్ణయించాలి.

– జి.సుధీర్, వైఎస్సార్‌టీఎఫ్ జనరల్ సెక్రటరీ

సాంకేతిక సమస్యలతో ఇబ్బంది


ఉపాధ్యాయులంతా క్లస్టర సమావేశాలకు ప్రభుత్వం ఆదేశాలు కనుగుణంగా ముందుగా నిర్ణయించిన సమయానికే హాజరవుతున్నారు. ప్రభుత్వ సైతం సాంకేతికపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ఇంటర్‌నెట్ ఇబ్బందులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. సమావేశాలు ఫలప్రదం కావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి.

– తోట ఎడ్వర్డ్, డీటీఎఫ్– 98 టీచర్ల జిల్లా అధ్యక్షుడు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య డి.హేమ సుందర్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.